ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 23, క్యారెట్ 19, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్8 21, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 45, మొరంగడ్డ 21, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సనత్‌నగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బేగంపేట పోలీసులు స్వాధీనం చేసుకుని మా ర్చురీకి తరలించారు. బేగంపేట రసూల్‌పురా అన్నానగర్ ఆటో స్టాండ్‌లో ఓ వ్యక్తి స్పృహ లేకు ండా పడి ఉన్నట్లుగా సమాచారంతో బేగంపేట పోలీసులు 108 వాహనంతో ఘటనా స్థలానికి చే రుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన సదరు వ్యక్తి అన్నానగర్ ఆటోస్టాండ్ పరిసర ప్రాంతాల్లో యాచక వృత్తి చేస్తుంటాడని స్థానికులు తెలిపారు.



కోడ్ కూసింది.. తనిఖీ షురువైంది

పార్లమెంట్ ఎన్నికల 'కోడ్' కూసింది దరిమిలా అధికారుల యాక్షన్ షురూ అయ్యింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు రంగంలోకి దిగాయి. పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. అనుమానం ఉన్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి పంపిస్తున్నారు. నిబంధనలకు మించి నగదు తరలింపుపై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లతో పాటు గోడలపై రాతలను తొలగిస్తున్నారు. ఎన్నికల్లో ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించే విధంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో పోలీసులు కవాతుకు సిద్ధమయ్యారు. ఆదివారం పలుచోట్ల సీఐఎస్‌ఎఫ్ పోలీసులతో కలిసి కవాతు జరిపి ప్రజల్లో ఓటు హక్కు వినియోగంపై ధైర్యాన్ని నింపారు. సైబరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు, మేడ్చల్ జిల్లాకు సరిహద్దుగా ఉన్న సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి నేతృత్వంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

–సనత్‌నగర్



ప్రచార రాతలను తొలగిస్తున్న సిబ్బంది



ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

కార్పొరేషన్లకు చైర్మన్‌ల నియామకంపై హర్షం

లాలాపేట: రాష్ట్రంలో 37 కార్పొరేషన్లకు ఏకకాలంలో చైర్మన్‌ల నియామకం, ప్రీతమ్‌ను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్టుమెంట్ స్టేట్ వైస్ చైర్మన్ బి. యాదగిరి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఏర్పాటైన ప్రజాపాలన సామాన్య ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. గత 10 ఏళ్ల దొరల పాలనలో సామాన్య ప్రజల నుంచి ఇతర పార్టీ ఎంపీ ఎమ్మెల్యేలకు సైతం ప్రగతి భవన్, సెక్రటేరియట్‌లోకి వెళ్లడానికి అవకాశం ఉండేది కాదని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కార్యకర్త నుంచి ప్రజా ప్రతినిధి వరకు ఎవరైనా స్వేచ్ఛగా మహాత్మా జ్యోతీరావు పూలే ప్రజాభవన్, సెక్రటేరియట్‌కు వెళ్లడానికి అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చి ఆరు గ్యారెంటీలను చెప్పినట్లుగానే 100 రోజుల్లో అమలు చేసిన ఘనత సీఎం రేవంత్ సర్కార్‌కు దక్కుతుందన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

అడ్డగుట్ట: లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పది పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ పల్లె పద్మ తెలిపారు. ఆదివారం లాలాగూడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సోమవారం నుంచి పది తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని సూచించారు.

సాయిబాబా దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా మహేష్



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడ రైల్వే బ్రిడ్జి సమీపంలోని సుప్రసిద్ధమైన శ్రీ సాయిబాబా దేవాలయం కమిటీ అధ్యక్షుడిగా బి. మహేష్ ఎన్నికయ్యారు. ఆదివారం ముదిరాజ్ భవన్‌లో జరిగిన సమావేశంలో మహేష్‌ను అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. కోర్ కమిటీ, ఆలయ కమిటీ ప్రతినిధులు హాజరై నూతన కమిటీ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. సాయిబాబా దేవాలయం సమగ్రాభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగుతూ చిత్తశుద్ధితో పనిచేస్తూ ఆలయం పేరు ప్రతిష్టతలను ఇనుమడింపజేస్తానని పేర్కొన్నారు. దేవాలయం కోసం పని చేసే ప్రతినిధులతో త్వరలో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ ప్రతినిధులు సతీష్, ఎస్. రాజేందర్, మల్లికార్జున్, ఎల్. బాబు, చంద్రశేఖర్, ఎస్. రాజ్‌కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

'నామినేటెడ్ పదవుల్లో మాలలకు అన్యాయం'

ఉస్మానియా యూనివర్సిటీ: నామినేటెడ్ పదవుల్లో మాలలకు తీరని అన్యాయం జరిగిందని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) అధ్యక్షులు నామ సైదులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 37 నామినేటెడ్ పదవుల్లో ఒక్కటి కూడా మాలలకు కేటాయించకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం మాలలకు కార్పొరేషన్, చైర్మన్ తదితర పదవుల్లో నియమించిందని గుర్తు చేశారు. మాలలకు విస్మరిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఆలయ ప్రాంగణంలో తాగునీటి ట్యాంక్ ప్రారంభం



ట్యాంకు ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

చిలకలగూడ : చిలకలగూడ గండి మైసమ్మ ఆలయ ప్రాంగణంలో మ్యాకల చంద్రశేఖరరావు ప్రజాసేవ (ఎంసీఆర్) నేతృత్వంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకును ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తుల కోరిక మేరకు మంచినీటి ట్యాంకును సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంసీఆర్ ఆధ్వర్యంలో అనేక ఆధ్యాత్మిక, ప్రజాసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచినీటి సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేసిన చంద్రశేఖర్‌ను ఆలయ నిర్వాహకులు, భక్తులు అభినందించారు.

పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి



సమ్మయ్య, బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్

సనత్‌నగర్: ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు దోహదపడాలని బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య విజ్ఞప్తి చేశారు. ఆస్తి పన్ను సమస్యలకు జీహెచ్‌ఎంసీ నిర్దేశించిన తేదీల్లో పరిష్కార వేదికలను సర్కిల్ కార్యాలయంలో నిర్వహించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఆదివారం నిర్వహించిన పరిష్కార వేదికలో ఆస్తి పన్ను సమస్యలపై 17 దరఖాస్తులను వచ్చాయని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్థిక సంవత్సరం మరికొన్ని రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఆస్తి పన్ను బకాయిదారుల కోసం జీహెచ్‌ఎంసీ ప్రత్యేక ఆఫర్‌ను కల్పించిందన్నారు. మొండి బకాయిలకు సంబంధించి వడ్డీపై 90 రాయితీ కల్పించడం జరిగిందని, దీనిని సద్వినియోగం చేసుకుని ఈ నెల 31 వరకు ఆస్తి పన్ను చెల్లించాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లను నూటికి నూరు శాతం లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇటీవల స్పెషల్ ఆఫీసర్ ఐఏఎస్ అధికారి శ్రీవత్సా కోట నిర్వహించిన సమావేశంలో సైతం తమ సిబ్బందికి దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు. బేగంపేట సర్కిల్ పరిధిలో రూ.108 కోట్ల ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం కాగా, 80 శాతం వరకు పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగతా వాటిని రానున్న 13 రోజుల్లో చేరుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

సికింద్రాబాద్ జిల్లా సాధనే ధ్యేయం



లష్కర్ జిల్లా సాధన వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిలకలగూడ : సికింద్రాబాద్ జిల్లా సాధనే ధ్యేయంగా పని చేస్తామని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి మధురానగర్‌కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్‌ను కమిటీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు సహకారంతో ప్రభుత్వాన్ని ఒప్పించి లష్కర్ జిల్లాను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ ప్రాంత ప్రాముఖ్యం, ప్రత్యేకతలపై ప్రభుత్వంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించేలా వాల్‌పోస్టర్‌ను రూపొందించామన్నారు. ఏడు నియోజకవర్గాలు, 40 జీహెచ్‌ఎంసీ డివిజన్లతో సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని పలువురు మంత్రులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు అందించామని, జిల్లా సాధనే ధ్యేయంగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి సాధం బాలరాజ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, సభ్యులు కృష్ణ, సాగర్, అశోక్, శ్రీనివాసగౌడ్, సునీల్, భువనగిరి శ్రీను పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌పై సీఎం ప్రత్యేక దృష్టి



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బద్దం బల్వంత్ రెడ్డి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించినట్లు టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కంటోన్మెంట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం బల్వంత్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ముఖ్యమంత్రిని కలిశారు. కంటోన్మెంట్‌లో ఉప ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో ఈ సారి పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలను సమాయత్తం చేయాలన్నారు.

సన్నాహక సదస్సును విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అడ్డగుట్ట: ఉస్మానియా యూనివర్సిటీలోని నాన్ టీచింగ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న పార్లమెంట్ సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు నరేంద్ర బాబు పిలుపునిచ్చారు. ఆదివారం అడ్డగుట్టలోని శాస్త్రినగర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన నరేంద్ర బాబు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ నెల 20న ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఫంక్షన్ హాల్లో సాయంత్రం ఎమ్మార్పీఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని 42 డివిజన్ల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో అడ్డగుట్ట డివిజన్ ఇన్‌చార్జి వేణుగోపాల్, కొమ్ము శేఖర్, డప్పు మల్లికార్జున్, రాజు, కుమార్, రవి, మహేష్, సాయి, మహేందర్, ఐలయ్య, గణేష్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో గెలుపు నాదే : రాగిడి



ఎమ్మెల్యేలు, నాయకులతో సమావేశమైన రాగిడి లక్ష్మారెడ్డి

కంటోన్మెంట్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా తన విజయం తథ్యమని బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం బోయిన్‌పల్లిలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి నివాసంలో పార్లమెంటరీ స్థానం పరిధిలోని ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ కుమార్, సీనియర్ నేతలు బొగ్గారం దయానంద్, మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ మహేందర్ రెడ్డి తదితర ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలన్నారు. కేసీఆర్ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. ముఖ్యంగా ఐటీ అభివృద్ధికి కేటీఆర్ ఎంతగానో కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు. బీజేపీని ఎదుర్కొని మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో గులాబీ జెండా ఎగరేస్తామన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ప్రధాని మోదీని కలిసిన రాచమల్ల

చిలకలగూడ : విజయ సంకల్ప యాత్రలో భాగంగా నగరానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని బేగంపేట విమానాశ్రయంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా బీజేపీ హవా కొనసాగుతుందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని నేరుగా కలవడం ఆనందంగా ఉందని కృష్ణమూర్తి సంతోషం వ్యక్తం చేశారు.

పాఠశాల వార్షికోత్సవంలో కానిస్టేబుల్ అత్యుత్సాహం

- పోలీస్ సైరన్‌తో పరుగులు పెట్టిన విద్యార్థులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

సనత్‌నగర్: పాఠశాల వార్షికోత్సవం జరుగుతుండగా అక్కడికొచ్చిన ఓ కానిస్టేబుల్ చేసిన హంగామాతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇక్కట్లకు గురయ్యారు. కార్యక్రమం జరుగుతుండగా రాత్రి 10 గంటల సమయంలో అక్కడికి వచ్చిన పెట్రోలింగ్ వాహనం ఏకధాటిగా ఆగకుండా సైరన్ మోగించడంతో పాటు లైట్లు తీసేయడంతో ఒక్కసారిగా పిల్లలు భయాందోళనకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో శనివారం రాత్రి హైదరాబాద్ సెంట్రల్ స్కూల్ వార్షిక వేడుకలు నిర్వహించగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథుల ప్రసంగాలు, విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు కొనసాగుతూ రాత్రి 11 గంటలు అయ్యింది. మరికొద్ది సేపట్లో వేడుకలు ముగిసే దశకు చేరుకుంటుండగా పెట్రోలింగ్ వాహనం అక్కడికి వచ్చింది. ఏకంగా గ్రౌండ్‌లోకి వచ్చిన వాహనం ఏకధాటిగా సైరన్ మోగిస్తుండడంతో అక్కడి పిల్లలు, తల్లిదండ్రులు ఒక్కసారిగా కంగారు పడ్డారు. పెట్రోలింగ్ కానిస్టేబుల్ సుధీర్‌కుమార్ లైట్లు ఆఫ్ చేయించడంతో ఒక్కసారిగా అంధకారం ఏర్పడింది. దీంతో చీకట్లో ఉన్న పిల్లలు, తల్లిదండ్రులు భయపడిపోయారు. తమ పిల్లల కోసం తల్లిదండ్రులు వెతుక్కునే క్రమంలో నానా హైరానా పడ్డారు. ఈ విషయమై పాఠశాల ఎస్వీ.రమణబాబు స్పందిస్తూ తాము గ్రౌండ్‌లో ప్రోగ్రాం నిర్వహణకు అనుమతితో పాటు పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. వీఐపీలు రాక, వారి ప్రసంగాలు, విద్యార్థుల కార్యక్రమాల నిర్వహణతో ఎక్కువ సమయం పట్టిందన్నారు. అయితే 11 గంటల సమయంలో పెట్రోలింగ్ కానిస్టేబుల్ వచ్చి లైట్లు ఆపడంతో పిల్లలు కంగారు పడిపోయారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో వెళ్లిపోయే వరకైనా లైట్లు వేయమని అడిగినా వినిపించుకోలేదన్నారు. పెట్రోలింగ్ సైరన్‌కు ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలు భయంతో పరుగులు పెట్టారన్నారు. కానిస్టేబుల్ తీరుపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఇంగ్లండ్‌లో వైద్యసేవలకు మూడు దశల్లో లైసెన్స్

డాక్టర్ మో సోభి 'ప్రత్యేక మాస్టర్‌క్లాస్'

లక్డీకాపూల్: ఇంగ్లండ్‌లో ప్రాక్టీస్ చేయడానికి కావాల్సిన లైసెన్స్ పొందడానికి మూడు దశలు ఉన్నాయని ప్రపంచ ప్రఖ్యాత ఉక్మాలా/ప్లాబ్ సీఈవో, ఫౌండర్ డాక్టర్ మో సోభి చెప్పారు. అందులో ఒకటి ఇంగ్లిష్ పరీక్ష అన్నారు. ఇంగ్లిష్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన రెండేళ్లలోపు ఉక్మాలా స్టెప్ 1, స్టెప్ 2 ఈ రెండు పరీక్షలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. దీని కోసం వైద్య విద్యార్థులు మెడికల్ డిగ్రీ, ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లో తమ కెరీర్‌లో ముందుకు సాగాలనుకునే వైద్య నిపుణులు, విద్యార్థుల కోసం అపోలో మెడికల్ కాలేజీలో అపోలో ఎడ్యుకేషన్ యూకే ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ మో సోభి 'ప్రత్యేక మాస్టర్‌క్లాస్' తీసుకున్నారు. ఈ ఒన్ డే ప్రోగ్రామ్‌లో భారతీయ వైద్య గ్రాడ్యుయేట్‌లకు ప్రొఫెషనల్, లింగ్విస్టిక్ అసెస్‌మెంట్స్ బోర్డ్ ఎగ్జామినేషన్‌ను నావిగేట్ చేయడానికి అవసరమైన అవగాహన, నైపుణ్యాలను అందించారు. యూకేలో వైద్య విద్య అభ్యాసానికి కీలకమైన దశ డాక్టర్ మో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను ఉక్మాలా పరీక్షపై రచించిన పుస్తకాన్ని త్వరలో ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ఉక్మాలా–ప్లాబ్ పరీక్షల సంబంధించిన సమగ్ర అవగాహనకు ఈ నెల18న చిత్తూరులో మరో మాస్టర్ క్లాస్ నిర్వహిస్తామన్నారు. యూకేలోని క్రూలోని అపోలో ఎడ్యుకేషన్ యూకే క్యాంపస్‌లో ఉక్మాలా/ప్లాబ్2 అకాడమీని కూడా నిర్వహిస్తున్నట్టు డాక్టర్ మో సోభి పేర్కొన్నారు.

బీసీలు సంఘటితంగా ఉద్యమించాలి

లిబర్టీ: బీసీల సంఘటిత శక్తి నిరూపించాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి అన్నారు. విడిపోతే పడిపోతాం ఐక్యంగా ఉంటే రాజ్యాధికారాన్ని సాధిస్తాం అన్న విషయాన్ని బీసీలంతా గమనంలోకి తీసుకోవాలని కోరారు. బీసీలు ప్రస్తుతం కీలక ఘట్టంలో ఉన్నారని సంఘటిత శక్తిని చాటి అధికారం చేపట్టేందుకు సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యత చాటాలని విన్నవించారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కుతున్న పాలకులు గద్దెనెక్కిన తరువాత ఆ వర్గం అభ్యున్నతి సంక్షేమాన్ని విస్మరిస్తూ చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యత చాటి కేంద్ర ప్రభుత్వాన్ని ఓడించి తీరాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు పదేళ్ల కాలంలో ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా బీసీల పట్ల ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే బీసీల బతుకులు ఆగమవుతాయని.. ఈ విషయాన్ని బీసీలు గమనంలోకి తీసుకోవాలని కుమరస్వామి సూచించారు.

కూల్ కూల్ కూలర్లు



రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు చల్లదనం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎండ వేడిమితో ఉపశమనం పొందేందుకు పేద, మధ్య తరగతి ప్రజలు అవసరమైన ఎయిర్ కూలర్స్, వివిధ రకాల ఫ్యాన్లను కొనుగోలు చేస్తున్నారు. తార్నాక డివిజన్ పరిధిలోని చాలా దుకాణాల్లో రకరకాల ఏయిర్ కూలర్లను విక్రయానికి సిద్ధంగా ఉంచారు. నగరంలో ఎక్కడా లభించని అసెంబుల్డ్‌లో రిమోట్ కంట్రోల్ ఎయిర్ కూలర్స్ లాలాపేటలో మాత్రమే లభిస్తున్నాయని నిర్వాహకులు యాదగిరి తెలిపారు. ఈ గత 30 ఏళ్ల నుంచి ఇదే రంగంలో ఉన్నామని, ప్రజలకు నాణ్యమైన ఎయిర్ కూలర్లను అందిస్తున్నామన్నారు. –లాలాపేట

మత్తును చిత్తు చేద్దాం



ఓయూలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం 2కే రన్ చేపట్టారు. భగత్‌సింగ్ యువజోత్సవాల్లో భాగంగా ఎన్‌సీసీ గేటు నుంచి ఆర్ట్స్ కాలేజీ వరకు రన్‌ను నిర్వహించారు. 'సే నో టు డ్రగ్స్' నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా విద్యార్థి నేతలు రవినాయక్, కోట రమేష్, నాగరాజు పేర్కొన్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ

గ్రామీణ ఉత్పత్తుల ప్రదర్శన



మదాపూర్‌లోని హైటెక్స్‌లో గ్రామీణ భారతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శనలో రేషన్ బయో ఉత్పత్తులను ఆసక్తిగా తిలకిస్తున్న నగర ప్రజలు